క్లుప్తంగా

వైభవంగా వరలక్ష్మీ వ్రతాలు



అమలాపురం వేంకటేశ్వరస్వామి ఆలయంలో వరలక్ష్మీదేవి వ్రతాలను ఆచరిస్తున్న మహిళలు

అమలాపురం టౌన్: శ్రావణ మాసం చివరి శుక్రవారం సందర్భంగా స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు శుక్రవారం ఉదయం అత్యంత వైభవంగా జరిగాయి. ఈ వ్రతాలను ఆచరించేందుకు మహిళలు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిసింది. ఆలయ అర్చకులు పెద్దింటి సత్యనారాయణాచార్యులు, పెద్దింటి వీబీఎల్ఎన్ ఆచార్యులు పర్యవేక్షణలో ఆలయ చైరపర్సన్ దూడల వెంకట విరీతాదేవి, ఈఓ దూనబోయిన సాయిబాబు, ధర్మకర్తల ఆధ్వర్యంలో సామూహిక వ్రతాలు జరిగాయి. పట్టణ వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడు దూడల ఫణి పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ జోలికొస్తే ఊరుకోం

ఐ.పోలవరం: ఎస్సీ వర్గీకరణ జోలికొస్తే టీడీపీ నాయకులను మాల పేటల్లో తిరగనిచ్చేది లేదని మాల మహానాడు సంఘ నాయకులు హెచ్చరించారు. శుక్రవారం పాతయింజరం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద మాల మహానాడు సమావేశం జిల్లా మాల మహానాడు కార్యదర్శి రేవు శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు వర్గీకరణకు సానుకూలంగా ఉన్నట్లు చెప్పడం టీడీపీ కుటిల నీతికి నిదర్శనమన్నారు. నియోజకవర్గంలో మాల, మాదిగలకు చిచ్చుపెట్టి రాజకీయ పబ్బం గడుపుకోవడానికి చూడటం సరికాదన్నారు. సమావేశంలో పోతుల రాజా, కర్నీడి సత్తిబాబు, వడ్డి గౌతమ్, యలమంచలి వాసు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

తాళ్లరేవు: స్థానిక శ్రీమతి నామన వెంకాయమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంపీపీ రాయుడు సునీత శుక్రవారం పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. ఈ సందర్భంగా అన్నం, పప్పు తోటకూరను రుచి చూసి నాణ్యతను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాలలో అంతా సవ్యంగా జరుగుతుండడంతో హెచ్ఎం ఆశాలతను ఎంపీపీ అభినందించారు. ఎంఈఓ ఎ.మంగాయమ్మ, కోరంగి ఎంపీటీసీ సభ్యురాలు పోతుల రత్నకుమారి, నాయకులు రాయుడు గంగాధర్ తదితరులు ఉన్నారు.

క్రీడా దుస్తుల పంపిణీ

ఐ.పోలవరం: జి.వేమవరం జెడ్పీ పాఠశాలకు అడ్డాల రాజు (చిన్న) తన కుమారుడు సతీష్‌కు మార్ జ్ఞాపకార్థం రూ.25 వేల విలువైన క్రీడా దుస్తులను శుక్రవారం అందజేశారు. పాఠశాలలో క్రీడాకారులకు 42 జతల క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. హెచ్ఎం సలాది వెంకట నారాయణ మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఉత్తేజాన్ని నింపుతాయన్నారు. దాతను పాఠశాల ఉపాధ్యాయులు యు.వెంకట్రావు, శ్రీమన్నారాయణ, వరలక్ష్మి, రామకృష్ణ, పీడీ కళావతి, రాంప్రసాద్ అభినందించారు.

విద్యార్థిని కొట్టారంటూ కేసు

అమలాపురం టౌన్: స్కూల్‌లో చదువుతున్న తమ కుమారుడిని కొట్టారని ఆ విద్యార్థి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదుపై స్థానిక శ్రీవాగ్దేవి స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీరామచంద్రమూర్తిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ డి.దుర్గాశేఖరరెడ్డి తెలిపారు. స్కూల్‌లో 8వ తరగతి విద్యార్థిని ప్రిన్సిపాల్ కొట్టడంతో తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారని సీఐ చెప్పారు. ఓ విద్యార్థిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడంతోనే తాను భయం చెప్పానని పోలీసుల విచారణలో ప్రిన్సిపాల్ వివరించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ముమ్మిడివరం: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి శుక్రవారం మృతి చెందాడు. చినకొత్తలంక గ్రామానికి చెందిన కాగిత అన్వేష్ (26) గత నెల 11న అత్తారిల్లు కామనగరువు వెళ్లి బైక్‌పై తిరిగి వస్తుండగా ముమ్మిడివరం జాతీయ రహదారి దొమ్మేటివారి పాలెం వద్ద రోడ్డు డివైడర్‌ను ఢీకొనడంతో కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. అతనికి భార్య స్వాతి, 8 నెలల పాప ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్.శివప్రసాద్ తెలిపారు.

యువకుడి దుర్మరణం

ముమ్మిడివరం: అనాతవరంలో శుక్రవారం తెల్లవారు జామున గుర్తు తెలియని యువకుడు(30) మృతి చెందాడు. గ్రామంలో పెట్రోల్ బంక్ సమీపంలో నడిచి వెళ్తున్న ఆ యువకుడిని గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

గ్రీన్ ఎనర్జీపై అవగాహన

అమలాపురం రూరల్: స్థానిక భట్లపాలెం ఇంజినీరింగ్ కళాశాలలో గ్రీన్‌ఎనర్జీ ఆధ్వర్యంలో ఈఈఈ మెకానికల్ ఆఖరి సంవత్సరం విద్యార్థులకు సౌర విద్యుత్తు ఉత్పాదన, వినియోగంపై జరిగిన సదస్సు శుక్రవారంతో ముగిసింది. సభలో కళాశాల ఈఈఈ, మెకానిక్ విభాగాధిపతులు ఎన్వీ రాజగోపాల్, ఎం.ఫణిశేఖర్, కళాశాల ప్రిన్సిపాల్ రామారావు, ఏఓ జక్కం కృష్ణారావు పాల్గొన్నారు.

విజయోస్తు.. విద్యా ప్రాప్తిరస్తు

- పేదల విద్యకు ప్రాధాన్యం
- జగనన్న విద్యా దీవెనతో విద్యార్థులకు మేలు
- రెండు నియోజకవర్గాల్లో 8,819 మందికి లబ్ధి



అమలాపురం కలెక్టరేట్‌లో విద్యార్థులకు విద్యాదీవెన చెక్కు అందజేస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా తదితరులు (ఫైల్)

అమలాపురం రూరల్: ఉన్నత విద్యకు పేదరికం అడ్డం కాకూడదని.. అందరూ విద్యనభ్యసించాలని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోంది.. ఈ పథకాల ద్వారా విద్యార్థులకు బాసటగా నిలుస్తోంది. ఐటీఐ నుంచి పీజీ వరకూ (ఇంటర్ తప్ప) చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, కాపు, మైనారిటీ, వికలాంగ విద్యార్థులకు జగనన్న విద్యా దీవెన పథకాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోంది. దీనిద్వారా అర్హులందరికీ పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ జరిగేలా చర్యలు తీసుకుంటుంది. అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల్లోని ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్, ఫార్మసీ తదితర కోర్సులు చదువుతున్న 8,819 మంది విద్యార్థులకు ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా మొత్తం రూ.10.12 కోట్లను విద్యార్థుల తల్లుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసింది. ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులను చదువులో ప్రోత్సహించడంలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా దీవెన పథకానికి రూపకల్పన చేసి అమలు చేస్తున్నారు. ఆర్థిక సమస్యలతో ఫీజులు కట్టలేని విద్యార్థులకు ఇది ఎంతగానో దోహదపడుతోంది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవల చిత్తూరు జిల్లా నగరి నుంచి జగనన్న విద్యాదీవెన పథకానికి సంబంధించిన సొమ్మును బటన్ నొక్కి విద్యార్థుల తల్లుల ఖాతాలో జమ చేశారు. అలాగే జగనన్న వసతి దీవెన పథకంలో ఐటీఐ విద్యార్థులు ఒక్కొక్కరికి రూ.పది వేల చొప్పున, పాలిటెక్నిక్ విద్యార్థులకు రూ.15 వేలు, డిగ్రీ, అంతకంటే ఎక్కువ కోర్సులు చేస్తున్న విద్యార్థులు ఒక్కొక్కరికి రూ.20 వేలు ఇస్తున్నారు. ఆ నిధులు మొత్తం తల్లుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నారు.

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు



జగనన్న విద్యా దీవెన పథకం ద్వారా ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో చదువు ఆటంకం లేకుండా సాగుతుంది. డిగ్రీలో మూడు పర్యాయాలు జగనన్న విద్యాదీవెన ద్వారా రూ.18 వేలు అందుకున్నాను. పేద కుటుంబాల్లోని విద్యార్థులకు ఈ డబ్బులు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మా కుటుంబం తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నా.

– పెచ్చెట్టి చైతన్య సద్గురుసాయి, బీఎస్సీ, దేవగుప్తం

ఎంతో ఉపయోగం



నేను బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో మూడో సంవత్సరం చదువుతున్నాను. జగన్ సీఎం అయినప్పటి నుంచి ఏటా ఫీజు రీయింబర్స్‌మెంట్ వస్తోంది. దీనివల్ల ఒత్తిడి లేకుండా ఉన్నత చదువులు చదువుకుంటున్నాను. మాకు ఇది ఎంతో ఉపయోగపడుతుంది.

– పెద్దిరెడ్డి మాధవి నాగదుర్గాలక్ష్మి, గాడిలంక

విగ్రహ ప్రతిష్ఠ పూజలు ప్రారంభం



రామాలయంలో పూజలు చేస్తున్న దంపతులు

కాట్రేనికోన: మండలంలోని రాజానగరంలో కొత్తగా నిర్మించిన రామాలయంలో విఘ్నేశ్వర, సీతారామలక్ష్మణ, ఆంజనేయ స్వామివార్ల యంత్ర, విగ్రహ, శిఖర ప్రతిష్ఠా మహోత్సవం శుక్రవారం ప్రారంభమైంది. ఆలయ కమిటీ పర్యవేక్షణలో గ్రామ ప్రజల ఆర్థిక సహాయంతో ఈ ఆలయాన్ని నిర్మించారు. సుమారు 30 మంది దంపతులు విగ్రహ ప్రతిష్ఠ పూజలు చేశారు. బ్రహ్మశ్రీ కాల్దారి వరప్రసాద్‌శాస్త్రి ఆధ్వర్యంలో వేద పండితులు హోమశాలలో పూజలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వరప్రసాద్‌శాస్త్రి మాట్లాడుతూ శనివారం శూలార్చన, హోమాలు తదితర పూజలు జరుగుతాయన్నారు. ఆదివారం ఉదయం 10.12 గంటలకు విగ్రహ ప్రతిష్ఠ ఉంటుందన్నారు.

కొబ్బరికి మద్దతు ధర ప్రకటించాలి

అల్లవరం: కొబ్బరికి మద్దతు ధర ప్రకటించి నాఫెడ్ కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు అన్నారు. వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఉంద్రు సుదర్శనరావు అధ్యక్షతన శుక్రవారం అల్లవరం–2 ఆర్బీకేలో వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రామేశ్వరం మొగని ఓపెన్ చేసి ముంపు సమస్యకు పరిష్కారం చూపాలన్నారు. ఏఓ ఎస్వీవీ సత్యనారాయణ మాట్లాడుతూ సెప్టెంబర్ 15 నాటికి ఈ–పంట నమోదు పూర్తి చేయాలన్నారు. డ్రైన్స్ ఏఈ సునీతాదేవి, హార్టికల్చర్ విస్తరణాధికారి వెంకటేశ్వరరావు, రైతులు కొనుకు బాపూజీ, రేవు సుందరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితే విజయం



బైజూస్ బోధన గురించి విద్యార్థులను అడిగి తెలుసుకుంటున్న సీఎంఓ సుబ్రహ్మణ్యం

అమలాపురం రూరల్: పదో తరగతి విద్యార్థులు ఇష్టపడి చదివితే పరీక్షల్లో విజయం వరిస్తుందని కోనసీమ జిల్లా సర్వశిక్షాభియాన్ సీఎంఓ బీవీవీ సుబ్రహ్మణ్యం అన్నారు. ఇందుపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి 580 మార్కులు వచ్చేలా ఇప్పటి నుంచే కష్టపడి చదవాలని సూచించారు. మధ్యాహ్న భోజన పథకం, బైజూస్ ట్యాబ్ ద్వారా విద్యా బోధనను పరిశీలించారు. అనంతరం పాఠశాలలో నాడు– నేడు పనులను పరిశీలించారు. పాఠశాల రికార్డుల పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ప్రధానోపాధ్యాయుడు వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రేపు కలెక్టరేట్ వద్ద వేడుకోలు దీక్ష

అమలాపురం రూరల్: సమగ్ర శిక్షాభియాన్‌లో కాంట్రాక్ట్ ఉద్యోగులుగా పనిచేస్తున్న తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 10న జిల్లా కలెక్టరేట్ వద్ద వేడుకోలు దీక్ష చేస్తామని ఆ యూనియన్ నాయకులు తెలిపారు. తమను రెగ్యులర్ చేయాలని, పీఆర్సీ ప్రకారం ఎంటీఎస్ అమలు చేసి వేతనాలు పెంచాలని వంటి సమస్యలు పరిష్కరించాలని ఈ దీక్ష చేస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు పోలిశెట్టి నరసింహ చంద్రకుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ జి.సత్యనారాయణ (పండు), ఉపాధ్యక్షుడు శారదాకృష్ణ, ట్రెజరర్ జనుపల్లి అశోక్ బాబు తెలిపారు.

విద్యతో పాటు క్రీడల్లో రాణించాలి

- ఎంపీపీ రాయుడు సునీత
- మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం



తాళ్లరేవులో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ రాయుడు సునీత తదితరులు

తాళ్లరేవు: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎంపీపీ రాయుడు సునీత తెలిపారు. శుక్రవారం స్థానిక శ్రీమతి నామన వెంకాయమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో విద్యా శాఖ ఏర్పాటు చేసిన మండల స్థాయి క్రీడా పోటీలను ఆమె ప్రారంభించారు. ఎంపీపీ మాట్లాడుతూ సీఎం జగన్ విద్యకు అధిక ప్రాధాన్యం ఇచ్చి విద్యార్థులకు సకల సౌకర్యాలు కల్పిస్తున్నారన్నారు. ప్రభుత్వం ఏటా స్కూల్ గేమ్స్‌ను నిర్వహిస్తుందన్నారు. అనంతరం అథ్లెటిక్స్ పోటీల్లో భాగంగా పరుగు పందెం, షార్ట్‌పుట్ తదితర పోటీలను ప్రారంభించారు. జెడ్పీ మాజీ చైర్మన్ దున్నా జనార్దనరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాద గోవిందకుమార్, రాయుడు గంగాధర్, ఎంఈఓలు ఎ.మంగాయమ్మ, మోకా ఉమ, మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ వీకేఆర్ తంబి, హైస్కూల్ కమిటీ చైర్మన్ ఎం.శ్రీనివాసరావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఉంగరాల వెంకటేశ్వరరావు, నాయకులు చిట్టూరి చలపతి, నందికోళ్ల శ్రీమన్నారాయణ, చందు తదితరులు పాల్గొన్నారు.

పోటీల్లో విజేతలు వీరే

అండర్– 14 బాలికల విభాగం 600 మీటర్ల పరుగులో బి.పావని (పి.మల్లవరం) ప్రథమ, షన్మిత (తాళ్లరేవు) ద్వితీయ స్థానంలో నిలిచారు. 400 మీటర్ల పరుగులో ఎం.ధరణి (నీలపల్లి), పి.దేవిజ్యోతి (చినవలసల), 200 మీటర్ల పరుగులో బి.పావని, ఎం.ధరణి, 100 మీటర్ల పరుగులో పి.దేవిజ్యోతి ప్రథమ, కె.నూకాంబిక (పటవల) ద్వితీయ స్థానంలో నిలిచారు. హైజంప్‌లో బి.పావని ప్రథమ, వి.రామలక్ష్మి ద్వితీయ, లాంగ్‌జంప్‌లో డి.అలేఖ్య ప్రథమ, వి.షన్మిత ద్వితీయ, షార్ట్ పుట్‌లో బి.పావని ప్రథమ, వి.షన్మిత ద్వితీయ, డిస్కస్ త్రోలో బి.హేమలత ప్రథమ, సీహెచ్ శ్రీహేమలత ద్వితీయ స్థానాలను సాధించారు. అలాగే అండర్–14 బాలుర, అండర్–17 బాలికలు, అండర్–17 బాలుర విభాగాల్లో పలువురు ప్రతిభ కనబరిచినట్లు తంబి తెలిపారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ సాయి

ఉప్పలగుప్తం: వరి సాగులో అధికారుల సూచనలతో సస్యరక్షణ చర్యలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ మోటూరి సాయి తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వ్యవసాయ సలహా మండల చైర్మన్ మానే శ్రీను అధ్యక్షతన ఏఓ జి.కుమార్ బాబు శుక్రవారం రైతులతో సమావేశం నిర్వహించారు. సాగులో తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులను ఏడీఏ ఎంఏ షంషీ రైతులకు వివరించారు. డ్రైన్స్ ఇరిగేషన్‌తో పాటు సంబంధిత అధికారులు తరచూ వ్యవసాయ సలహా మండల సమావేశానికి గైర్హాజరు అవుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇకపై విధిగా వ్యవసాయ అధికారులంతా సమావేశానికి హాజరు కావాలన్నారు. సమావేశంలో రైతు నాయకులు మారిశెట్టి పుండరీకాక్షుడు, ఆకుల వెంకట సత్యనారాయణ, రుద్రరాజు, ఏరువాక శాస్త్రవేత్త ప్రదీప్, హెచ్ఓ కె.చందన తదితరులు పాల్గొన్నారు.

మహాయజ్ఞంలో భాగస్వాములు కావాలి

ఐ.పోలవరం: అత్యంత శక్తివంతమైన లలితా సహస్రనామ పారాయణ పఠనం ద్వారా అమ్మవారి అనుగ్రహం కలుగుతుందని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త డాక్టర్ అనంతలక్ష్మి తెలిపారు. శుక్రవారం మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో పారాయణ బృందాల సమ్మేళనం జరిగింది. పరిసర ప్రాంతాల మహిళా మండలి బృందాలతో సమావేశం ఏర్పాటు చేశారు. త్వరలో లలితా సహస్రనామ పారాయణ మహా యాగానికి మహిళా బృందాల సమీకరణ చేసి మహాయజ్ఞంలో భాగస్వాములు కావాలని ఆహ్వానం పలుకుతూ ఈ కార్యక్రమాలు చేపట్టారు. ఆధ్యాత్మిక వేత్త సుధీర, ఉష, జంధ్యాల విజయలక్ష్మి, ఎస్ఎస్ఎఫ్ విభాగ కన్వీనర్ సీహెచ్ గోపాలకృష్ణ, సంధ్యా గురుకుల రాష్ట్ర సమన్వయకర్త లక్ష్మీనారాయణ, ధర్మ ప్రచారకులు ధర్మారావు, కనకారావు, నూలు వల్లీ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలకు రాట ముహూర్తం

యానాం: స్థానిక రామాలయం సెంటర్‌లో శ్రీవరసిద్ధి వినాయక ఉత్సవాలకు శుక్రవారం రాట ముహూర్తం చేశారు. కోన నాగేశ్వరరావు ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు.

నేడు తపాలా సేవలపై సదస్సు

తాళ్లరేవు: తపాలా శాఖ ద్వారా ప్రజలకు అందించే పలు సేవలపై శనివారం అవగాహన కల్పించనున్నట్లు కాకినాడ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.ప్రకాశరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక అంబేడ్కర్ భవన్‌లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ సదస్సు జరుగుతుందన్నారు. తమ శాఖ ద్వారా పలు పొదుపు, ఇతర పథకాలపై వినియోగదారులకు వివరిస్తామన్నారు. దీనికి ప్రజాప్రతినిధులు, ప్రజలు, ఖాతాదారులు హాజరు కావాలని తాళ్లరేవు పోస్ట్ మాస్టర్ కృష్ణంరాజు కోరారు.

వైఎస్సార్ సీపీ పాలనలో సంక్షేమం



పేరూరులో లబ్ధిదారులకు పథకాల బుక్‌లెట్ అందిస్తున్న డాక్టర్ శ్రీకాంత్

అమలాపురం రూరల్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో పేదల ఇంటికి సంక్షేమం వచ్చిందని రాష్ట్ర మంత్రి పినిపే విశ్వరూప్ తనయుడు డాక్టర్ పినిపే శ్రీకాంత్ అన్నారు. పేరూరు 14వ వార్డు పరిధి కొంకాపల్లి బీవీఆర్ కాలనీలో శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకోవడంతో పాటు ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. పథకాలతో ఏ మేరకు లబ్ధి చేకూరిందో ఆయా వర్గాలకు వివరించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పేరూరు గ్రామంలో సచివాలయాలు, పాఠశాలలు, రోడ్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పించారని శ్రీకాంత్ వివరించారు. ప్రతి గడపకూ సంక్షేమ ఫలాలు అందిస్తున్న ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ పందిరి శ్రీహరిరామ్ గోపాల్, పార్టీ మండల అధ్యక్షుడు బొంతు గోవిందశెట్టి, సర్పంచ్ అరుణ డేవిడ్, ఉప సర్పంచ్ కుడుపూడి సత్యనారాయణ, మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, గ్రామ కమిటీ అధ్యక్షుడు చొల్లంగి సుబ్బరామ్, సెంట్రల్ డెల్టా బోర్డు చైర్మన్ కుడుపూడి వెంకటేశ్వరబాబు, రూరల్ కార్యదర్శి సూదా గణపతి, జిల్లా కార్యదర్శి సరేళ్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'పై సమీక్ష




పీహెచ్‌సీ వైద్యులతో సమీక్షిస్తున్న ఎంపీపీ రాయుడు సునీత, ఎంపీడీఓ అనుపమ

తాళ్లరేవు: ప్రభుత్వం ఈ నెల 30వ తేదీ నుంచి ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై శుక్రవారం ఎంపీపీ రాయుడు సునీత పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఆమె కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా చేపట్టాల్సిన అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఎం.అనుపమ మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ నుంచి వలంటీర్లు ఇంటింటి సర్వే నిర్వహించి ఆరోగ్య సర్వే చేపడతారన్నారు. గడప గడపకూ ఏఎన్ఎంలు, పీహెచ్ఓలు వచ్చి వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామాలలో వైద్య శిబిరాలు నిర్వహించి పరీక్షలు చేయడంతో పాటు మందులు అందజేస్తారన్నారు. అదేవిధంగా ఆరోగ్యశ్రీ పథకంపై ప్రజలకు పూర్తిగా అవగాహన కల్పిస్తారన్నారు. ఈ సమీక్షలో గాడిమొగ పీహెచ్‌సీ వైద్యులు జయభార్గవి, శ్రీనివాస్, కుమార్ తదితరులు ఉన్నారు.

అల్లవరం: ఈ నెల 30 నుంచి అక్టోబర్ 28 వరకూ నిర్వహించే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కృష్ణమోహన్ పిలుపునిచ్చారు. అల్లవరం మండల పరిషత్ కార్యాలయంలో జగనన్న ఆరోగ్య సురక్షపై సమీక్ష నిర్వహించారు. నెల రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో అన్ని సచివాలయాల్లో నిపుణులైన వైద్యులతో వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. తహసీల్దార్ సాంబశివప్రసాద్, డీటీ వీవీ సత్యనారాయణ, డాక్టర్ స్పందన, సుమ, శాంతిప్రియ, బాలసుబ్రహ్మణ్యం, కార్యదర్శులు పాల్గొన్నారు.

నాడు కాసులు.. నేడు కష్టాలు



టమాటా రైతు పరిస్థితిపై రాము గీసిన వ్యంగ్య చిత్రం

అమలాపురం రూరల్: నాడు కాసులు కురిపించిన టమాటా ధర నేడు రైతన్నకు కన్నీరు రప్పిస్తోంది. లాభాల బాటలో ఉన్న నాటి టమాటా రైతు ఆనందాన్ని, నేడు గిట్టుబాటు ధర లేక దయనీయ స్థితిలో ఉన్న వెతలను కళ్లకు కట్టినట్లు బండారులంకకు చెందిన వ్యంగ్య చిత్రకారుడు మాడా రాము గీసిన చిత్రం ఆలోచింపజేస్తోంది. వృత్తి రీత్యా స్థానిక ప్రైవేట్ కళాశాలలో ఇంగ్లిష్ లెక్చరర్‌గా పని చేస్తూ, ప్రవృత్తిగా వ్యంగ్య చిత్రాలు గీస్తూ అనేక పోటీల్లో రాము బహుమతులు అందుకున్నారు.

యువత ఆకాంక్షలకు అనుగుణంగా ఎస్‌బీఏ



సదస్సులో మాట్లాడుతున్న రాష్ట్ర స్వదేశీ జాగరణ్ మంచ్ మహిళా ప్రముఖ్ పావని

అమలాపురం టౌన్: దేశంలో యువత స్వయం సమృద్ధి సాధించాలనే ఆకాంక్షలకు అనుగుణంగా స్వావలంబి భారత్ అభియాన్ (ఎస్‌బీఏ) ఏర్పాటైందని రాష్ట్ర స్వదేశీ జాగరణ్ మంచ్ మహిళా ప్రముఖ్ పి.పావని తెలిపారు. ఎస్‌బీఏ ఆధ్వర్యంలో స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల, ఎస్‌కేబీఆర్ కళాశాలల్లో ఎంటర్‌ప్రెన్యూర్ షిప్, స్వయం ఉపాధిపై శుక్రవారం అవగాహన సదస్సులు జరిగాయి. ఆమె మాట్లాడుతూ ఉపాధి కల్పనా అవగాహన కేంద్రాలు దేశవ్యాప్తంగా జిల్లాల్లో మొదలయ్యాయని అన్నారు. వివిధ రకాల ప్రభుత్వ, బ్యాంక్ రుణ పథకాలు, రాయితీలు తదితర వాటి గురించి సమాచారం ఇవ్వడానికి కేంద్రంగా ఎస్‌బీఏ పనిచేస్తుందని వివరించారు. ఈ సదస్సుల్లో ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ సుబ్బారెడ్డి, ఎస్‌కేబీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.కుమారశాస్త్రి, ఎస్‌కేబీఆర్ బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ జి.అంజనీ ప్రసాద్, రెండు కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సత్కారం



నంగవరంలో వెంకటేశ్వరరావును సత్కరిస్తున్న ఎంఈఓ తదితరులు

ఉప్పలగుప్తం: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్న నంగవరం ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయుడు వాసంశెట్టి వెంకటేశ్వరరావును పలువురు శుక్రవారం ఘనంగా సత్కరించారు. పాఠశాలలో ఆయనకు ఎస్ఎంసీ చైర్మన్ బడుగు శ్రీనుబాబు అధ్యక్షతన ఎంఈఓలు కె.కిరణ్‌బాబు, ఎస్.సత్యకృష్ణ పూలమాలలు వేసి సత్కరించారు. దార్ల నాగలక్ష్మి, యూటీఎఫ్, ఎస్టీయూ మండల అధ్యక్షులు గుత్తుల సుబ్రహ్మణ్యం, సూదా రామారావు, వై.శ్రీనివాస్, కె.నవీన్, బీవీఎస్ నారాయణ, కీర్తిబాల, పి.నాగకుమారి తదితరులు పాల్గొన్నారు.

హోం మంత్రికి ఎమ్మెల్యే శుభాకాంక్షలు

యానాం: పుదుచ్చేరి హోంమంత్రి ఓం నమఃశ్శివాయం జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస అశోక్ శుభాకాంక్షలు తెలిపారు. పుదుచ్చేరి మనవళిలోని మంత్రి స్వగృహంలో ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

న్యాయం చేయాలంటూ వినతి

ముమ్మిడివరం: స్థానిక గొల్లలవీధికి చెందిన వలంటీర్ దంపతులు కృష్ణప్రసాద్, వరలక్ష్మిలకు పది నెలల బాలుడు షణ్ముఖ మానస ఉన్నాడు. అతనికి మూడు నెలల కిందట ఏఎన్ఎం మీజిల్స్ వ్యాక్సిన్ వేశారు. వ్యాక్సిన్ వేసిన ప్రాంతంలో కణితి రావడంతో ఏఎన్ఎంను అడగ్గా ఐస్ పెడితే సరిపోతుందని చెప్పారని తల్లిదండ్రులు అన్నారు. ఇప్పుడు మరో కణితి రావడంతో ప్రైవేట్ ఆసుపత్రిలో శస్త్రచికిత్స చెయ్యాల్సి వచ్చిందన్నారు. దీనిపై కలెక్టర్ హిమాన్షు శుక్లాకు ఫిర్యాదు చేశామన్నారు.